# పల్లె కొమ్మలు

-మల్లాది రమాంజలి

డిసెంబర్ చలి వణుకు పుట్టిస్తోంది. దూరంగా పొగమంచు కమ్ముకుని వుంది. ఎదురుగా వెహికిల్స్ వస్తున్నా సరిగ్గా కనబడడం లేదు. రోడ్డుకి ఇరువైపులా పచ్చని పెద్ద వృక్షాలున్నా పొగమంచు కప్పేయడంవల్ల అదోమాదిరిగా ఉన్నాయి. అంత మంచులో కూడా మార్నింగ్ వాక్ చేయనిదే గోపాలకృష్ణకు, నాకు రోజు గడిచినట్లుండదు. అలాగే ఆ రోజు బయలుదేరాం. గోపాలకృష్ణ, నేనూ ఒకే వయస్సువాళ్లం. పక్కపక్క ఇల్లవాళ్లం, ఒకే ఆఫీసులో పని చేసే వాళ్లం. గోపాలకృష్ణ వయస్సు ఏభై దాటుతున్నా, పాతికేళ్ల కుర్రాడిలా హుషారుగా ఉంటాడు. అతని భావాలు కూడా అలాగే ఉంటాయి. నేను అతనికి పూర్తిగా వ్యతిరేకం.

"ఏమిటోయ్ ఆనందరావు! ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉంటావు? ఈ జీవితం చాలా చిన్నదయ్యా. బ్రతికి వున్నన్నాళ్లూ హాయిగా బ్రతికేయాలి. జీవితాన్ని అందంగా, ఆనందంగా అనుభవించాలి" ఎప్పుడూ ఆ మాట చెప్తూనే వుంటాడు. నేను నవ్వేస్తూ ఉంటాను.

ఆ రోజు ఏదో కొత్త విషయం చెప్తానని బయలుదేరినది మొదలు చెప్పుకొస్తున్న గోపాలకృష్ణ సగం దూరంలోనే తను చెప్పదలచుకున్న విషయం గురించి మరచిపోయాడు. గోపాలకృష్ణకి మతిమరుపెక్కువ.

"గోపాల్! ఏదో కొత్త విషయం చెప్తానన్నావ్?" గుర్తు చేసాను.

"అవును. మర్చిపోయానోయ్. మా అబ్బాయికి మా చెల్లెలు ఏదో సంబంధం ఉందని చెప్పింది. రేపు వెళ్లి ఆ పిల్లను చూసి రావాలి. నీవూ, చెల్లాయి కూడా వస్తే సంతోషిస్తాం. కానీ..."

"మరీ పల్లెటూరి సంబంధమోయ్. పిల్ల బాగానే చదువుకుందనుకో. ఈ సిటీలో ఇమడగలిగిన పిల్ల. చాకులాంటి పిల్లను చూద్దామనుకుంటే మా చెల్లెలు ఊరుకోడంలేదోయ్. చూసిన ప్రతి పిల్లా నచ్చాలని లేదుకదా. చూద్దాం" అన్నాడు.

"పల్లెటూరి పిల్లల గురించి అంత తక్కువగా అంచనా వేయకు గోపాల్. వాళ్లు పద్ధతిగా ఉంటారు. అణకువ, ఆప్యాయత, అవగాహన పాలెక్కువ. ఎక్కడైనా ఇమిడిపోతారు" నా అభిప్రాయం చెప్పాను.

"అవునోయ్... మీ ఆవిడా, మా ఆవిడా పల్లెటూరి రకాలే అనుకో. ఆ రోజులకు, ఈ రోజులకు తేడాలేదూ" అన్నాడు.

నడుస్తూనే జేబులోంచి ఆ పిల్ల ఫోటో తీసి చూపాడు గోపాల్.

అప్పటికి మంచుతెరలు విడిపోయి సూర్యభగవానుడు ఆకాశంలోంచి తొంగి చూస్తున్నాడు. పిల్ల ఫోటో చాలా బాగుంది.

గోపాల్ ఇంటికి తగ్గ కోడలు ఆమే అనిపించింది నాకు. ఆ మాటే అతనితో చెప్పాను.

తల పంకించి ఫోటో జేబులో పెట్టుకుని నాకు బై చెప్తూ ఇంట్లోకి నడిచాడు.

ఆఫీసుకి టైమవడంతో ఇక త్వరగా బయలుదేరాలన్నట్లుగా నేనూ ఇంట్లోకి నడిచాను.

★★★

పెళ్లిచూపుల ఏర్పాట్లు బాగానే చేసారు ఆడపెళ్లివారు.

నరేష్ ఆఫీసులో బిజీగా ఉండడంవల్ల మాతో రాలేకపోయాడు.

గోపాల్ కుటుంబంతో మేమూ వెళ్లక తప్పలేదు. పిల్ల తండ్రి ఆ ఊళ్లో మోతుబరి రైతు. పల్లెటూరి పంచె కట్టులో హుందాగా ఉన్నాడు. మర్యాదలకు లోటులేదు. గోపాల్ చెల్లెలు ఆ ఇంట్లో ఓ సభ్యురాలిలా వారికి సహాయం చేస్తుంది.

పెళ్లికూతురు ఆ ఊరికి పదిమైళ్లదూరంలో కొత్తగా పెట్టిన ఇంజనీరింగ్ కాలేజీలో ఆఖరి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతోంది. పిల్ల మంచి రూపసి.

దానికితోడు వినయం, విధేయత కలిగినదని ఇట్టే చెప్పేయ్యవచ్చు. ఆ పిల్ల నాకు బాగా నచ్చింది.

గోపాల్ ముఖంలోకి ప్రసన్నంగా చూసాను. అతని ముఖం అప్రసన్నంగా ఉంది. ఉండి ఉండి పిల్ల తండ్రి వంక ఈసడింపుగా చూస్తున్నాడు. అతన్ని అడగకుండానే ఈ సంబంధం నచ్చలేదని తెలిసిపోయింది నాకు.

ఆ రాత్రి గోపాల్ చెల్లెలు వాణి ఇంట్లో బస చేసాం.

"ఏం అన్నయ్యా! పెళ్లికూతురు నచ్చిందా? వాళ్లకి ఏం చెప్పమంటావు?" అన్నది వాణి.

గోపాల్ ఓ పది నిముషాలు నసిగి "ఆ అమ్మాయి తండ్రి మరీ బండి నాయుడిలా ఉన్నాడమ్మా. రేపు మనవాడి పెళ్లి రిసెప్షన్‌లో నా వియ్యంకుడని చెప్పుకోవడం కూడా సిగ్గుచేటే. మరీ మోటుగా, నల్లగా, తుమ్మమొద్దులా ఉన్నాడు. చూస్తూ చూస్తూ ఈ పల్లెటూరి పిల్లను మెడకో డోలు అన్నట్లు మావాడికి కట్టబెట్టనా? నరేష్ చిన్నతనంనుంచీ సిటీ జీవితానికి


అలవాటుపడ్డాడు. ఏ పండక్కో, పబ్బానికో వెళ్లినా అసలు కనీసపు సౌకర్యాలులేని ఆ ఇంట్లో రెండురోజులు కూడా ఉండలేడు. మాకు నచ్చలేదని చెప్పేయ్ వాణీ'' మొహమాటం లేనట్లుగా అన్నాడు గోపాల్.

వాణి ముఖం కోపంతో ఎర్రబడింది.

"అన్నయ్యా! నాకు తెలీక అడుగుతాను... నీ కొడుకు పిల్లతో కాపురం చేస్తాడా? పిల్ల తండ్రితోనా?'' సూటిగా ప్రశ్నించింది.

ఆవిడ ప్రశ్నకు నవ్వొచ్చినా గోపాల్ ముఖం చూసి బలవంతంగా ఆపుకున్నాను.

"తండ్రి వ్యవసాయదారుడైతేనేమిటి? ఉద్యోగస్తుడు అయితేనేమిటి? మంచితనం ముఖ్యం అన్నయ్యా... తను చదువుకోలేదనే తన పిల్లలను గొప్పగా చదివిస్తున్నాడు. మహాలక్ష్మి చాలా మంచిపిల్ల. నా మాట విని నీ ఇంటి మహాలక్ష్మిగా చేసుకో. నీవు చెప్పు వదినా?'' వదినగారికేసి చూస్తూ నచ్చచెబుతున్నట్లుగా అన్నది వాణి.



"మీ అన్నగారి ఇష్టమే నా ఇష్టం వాణీ'' గోపాల్ భార్య అంది.

"నాకు నా స్టేటస్ ముఖ్యం వాణీ. పిల్లతోపాటు పిల్ల తండ్రికి కూడా గొప్పగా చెప్పుకునే చరిత్ర ఉండాలి. ఈ నిరక్షరకుక్షి నా వియ్యంకుడు కాత గడు'' చెప్పేది ఇంకేమీ లేనట్లు అన్నాడు గోపాల్.

అన్నగారి మాటలను విన్న వాణి మరేమీ మాట్లాడలేకపోయింది.

ఈ విషయంలో గోపాల్ మరోసారి ఆలోచిస్తే బాగుండేదనిపించింది నాకు. అది వారి నిర్ణయం.

వారి స్వవిషయం. నేను నోరు మెదపలేదు. మర్నాడే ఊరు బయలు దేరాం.

★★★

ఊరు వచ్చేసి పదిరోజులైనా మహాలక్ష్మి కుటుంబం నా కళ్లల్లో మెదులు తూనే వుంది.



## హాలీవుడ్‌లో ఇలియానా!

ప్రస్తుతం తెలుగులో జోరు తగ్గిన ఇలియానాకి హాలీవుడ్‌లో అవకాశం వచ్చే సూచనలున్నాయని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవలే ఆమెను ఓ హాలీవుడ్ నిర్మాత కాంటాక్ట్ చేసి ఓ వేషం ఆఫర్ చేశాట్ట. అయితే పాత్ర చిన్నదే అయినా ముఖ్యమైనది కావడం వల్ల దీన్ని చేయడానికి ఇలియానా ఒప్పుకున్నట్టు, అదే నిర్మాత నిర్మించే మరో ఇంగ్లీషు సినిమాలో మాత్రం ఇలియానాకి ప్రధాన పాత్రని ఇస్తానన్నట్టు వినికిడి. ఇదే నిజమైతే ఇలియానా ఇంటర్నేషనల్ స్టార్ అయినట్టే!




ఆ పిల్ల నా కోడలైతే... అనే ఆలోచన ఎన్నోసార్లు రాకపోలేదు. ఆమాటే నా భార్యతో అన్నాను.

ఆమె పల్లెటూరిలో పుట్టి పెరిగినా తను పురిటికందుగా ఉన్నప్పుడే సిటీ లైఫ్‌కి అలవాటుపడిన భ్రమలో ఉంటూ వచ్చింది.

"ఆ పిల్ల మరీ నాటుగా ఉందండీ. మన మహేష్‌కి తగదు'' ఒక్క మాటలో చెప్పింది.

రూపం, భావాలు మోడరన్‌గా మార్చుకున్నా మా ఆవిడ ఛాయాదేవికి ఎక్కువా, సూర్యకాంతానికి తక్కువా! ఆ నిజం పెళ్లయిన మర్నాడే విధిలేక జీర్ణించుకున్నాను.

ఎన్నిరోజులైనా మహాలక్ష్మి బదులుగా వేరెవరినీ నా కొడుకు పక్కన ఊహించుకోలేకపోతున్నాను.

ఆ విషయమే వాడితో ప్రస్తావిస్తే "నీ ఇష్టమే నా ఇష్టం నాన్నా'' అన్నాడు.

గోపాల్‌తో చెప్పి ఆ సంబంధం ఖాయం చేసుకున్నాం. నా భార్య నన్ను బెదిరించినా నేను లొంగదల్చుకోలేదు.

చివరికి అత్త కట్నం భారీగా ముట్టేసరికి ఆమె నోరు ఠక్కున మూతబడింది.

మరో ఆరునెలలకు తన చదువు పూర్తి కాగానే మహాలక్ష్మి కోడలిగా మా ఇంట్లో అడుగుపెట్టింది.

ఆమె వినయం, విధేయతా నాకు చాలా బాగా నచ్చాయి. తన మంచితనంతో మరో రెండునెలల్లో నా భార్యను నిర్మలమ్మను చేసేసింది.

"ఏంటోయ్ ఆనందరావ్! తొందరపడి ఈ నిర్ణయం తీసుకున్నావనిస్తోం దోయ్. అయినా అంతా జరిగాక ఇంకా అనుకుని ఏం ప్రయోజనం?'' సానుభూతి చూపబోయాడు గోపాల్.

"గోపాల్! ఆ ఊరూ, మనుష్యులు, ఆ వాతావరణం నాకు నచ్చాయి. వాతావరణంలో కలుషితం లేనట్లే వారి మనస్సులు కూడా కల్తీ లేనివి. నాకు అది ముఖ్యం. వారి హోదా కాదు'' అన్నాను.

గోపాల్ మరేమీ మాట్లాడలేదు.

★★★

ఊళ్లోనే ఓ మంచి సంబంధం కుదిరింది నరేష్‌కి. పిల్ల తండ్రికి రకరకాల వ్యాపారాలున్నాయి.

గోపాల్‌కంటే ఎన్నోరెట్లు పై స్థాయిలో ఉన్నాడతను. నరేష్ చదువు, తెలివి, ఉద్యోగం, మంచితనం నచ్చడంవల్ల ఇంక ఆలస్యం చేయకుండా తాంబూలాలు పుచ్చేసుకున్నారు.

డబ్బుతో వచ్చిన రీవీ తప్ప నాకేం ప్రత్యేకతా కనబడలేదు ఆమెలో. గోపాల్ నేలమీద నడవడం మానేసాడు.

నాతో వాకింగ్‌కు వచ్చినప్పుడల్లా వియ్యంకుడి డబ్బు, హోదా గురించే ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాడు. అతను చెప్పింది విని ఊరుకోవడం తప్ప నేనేం మాట్లాడను.

నరేష్ పెళ్లి చాలా వైభవంగా జరిగింది. వాళ్ల మామగారు హనీమూన్‌కి సింగపూర్ పంపించారు.

ఇంట్లో కాలు కారులో, కారులో కాలు ఇంట్లో పెట్టేంత హోదా, వైభవం వచ్చాయి నరేష్‌కి.

ఈలోపు ట్రైనింగ్ కోసం మూడునెలలపాటు వేరే ఊరు వెళ్లాల్సి వచ్చింది మహేష్‌కి.

మహాలక్ష్మిని పుట్టింటికి వెళ్లమన్నాడు. దగ్గరి ఊరే కాబట్టి తననే వారాని

కోసారి రమ్మని,. తను మా దగ్గరే ఉంటానని చెప్పింది.

పెళ్లయిన మర్నాడే ప్రైవసీ పేరుతో వేరింటి కాపురం పెట్టించే కోడళ్లను చూసానుగానీ మా మహాలక్ష్మి అందుకు పూర్తి వ్యతిరేకం అయినందుకు సంతోషించాను.

★★★

హనీమూన్ నుంచి వచ్చిన తరువాత కూతుర్ని అత్తవారింటికి పంపిన ట్లుగా కొడుకును ఇల్లరికం పంపాడు గోపాల్.

"ఇదేం విడ్డూరమయ్యా. ఒక్కగానొక్క కొడుకును నీకు కాకుండా ఇల్ల రికం పంపావు. ఆ డబ్బును, ఆ హోదాను చూసి నీ కొడుకు నిన్ను నిర్లక్ష్య చేయడూ. నీ శేషజీవితం ఎలా గడుస్తుందో ఆలోచించావా?" ఆశ్చర్యంగా అన్నాను.

"మరేం కొంపలు మునిగిపోవులేవయ్యా. నా కొడుకు నా ఎదురుగా ఈ ఊళ్లోనే దర్జాగా బ్రతికేస్తాడు. వాళ్లకీ ఒక్కగానొక్క కూతురు, నాకూ ఒక్కగా నొక్క కొడుకు. రెండావుల దూడలా నిక్షేపంగా ఉంటాడు. నా కొడుక్కి ఇష్టం లేకపోయినా నేనే నచ్చచెప్పి పంపించాను. వాడికేం మహారాజులా ఉంటాడు" ధీమాగా అన్నాడు.

వియ్యంకుడు గోపాలకృష్ణ తల్లోంచి వచ్చాడనీ, కొడుకైనా అల్లుడైనా అతడే కాబట్టి అల్లుడిని తన కనుసన్నలలో పెడుతున్నాడనే విషయం డబ్బు, హోదా మైకంలో మునిగిపోయిన గోపాలకృష్ణ ఎప్పటికి తెలుసుకుం టాడో పాపం!

★★★

మరో పదిరోజులకు కొడుకును చూడకుండా తాను ఉండలేకపోతున్నా నని గోపాలకృష్ణ భార్య గొడవ పెట్టడంతో ఇక చేసేదిలేక ఆఫీస్ నుంచి రాగానే ఇంటి తాళం వేసి మాతో చెప్పి వియ్యంకుడు ఇంటికి బయలుదేరి వెళ్లారిద్దరూ.

నిజమే! పాతికేళ్లు పెంచి పెద్ద చేసిన కొడుకు ఒక్కసారిగా దూరమైతే ఏ తల్లి ఉండగలదు?

మరి కాసేపటికే గోడకు కొట్టిన బంతిలా తిరిగొచ్చిన గోపాలకృష్ణ దంప తులను చూడగానే జరిగినది ఏమయ్యుంటుందో కొంత గ్రహించాను. కానీ నేను ఊహించింది నిజం కావచ్చు, కాకపోవచ్చు.

★★★

మర్నాడు ఉదయాన్నే ఇద్దరం వాకింగ్‌కు బయలుదేరాం. గోపాల్ ఎప్ప టిలా హుషారుగా లేడు.

నిజమేమిటో అతని నోటివెంటే వినాలన్నట్లుగా నేనూ అడగలేదు.

"ఆనంద్! వియ్యానికైనా కయ్యానికైనా సమఉజ్జీ ఉండాలనే విషయం ఇప్పటికి గ్రహించానోయ్. నిన్న వాళ్లింటికి వెళ్లేసరికి ఏదో పెద్ద పార్టీ జరు గుతున్నట్లుంది. ఇంటి ముందు అనేక రకాల కార్లు, రంగురంగుల లైట్ల తోర ణాలతో అలంకరించిన ఆ భవనం నిజంగా ఇంద్రభవనంలా ఉంది. వాచ్ మెన్ మమ్మల్ని గుర్తించి లోపలకు వెళ్లడానికి దారిచ్చాడు. కుతూహలం ఆపుకోలేక అక్కడ ఏం జరుగుతుందో అతన్ని అడగాలనుకుని అతని దగ్గర చులకన కాలేక ఆ ప్రయత్నం మానుకున్నాను.


సిటీలో వున్న పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలందరికీ కూతురి పెళ్లి సంద ర్భంగా మా వియ్యంకుడు పార్టీ ఇస్తున్నాడని గ్రహించాను. కనీస మర్యాద కైనా మమ్మల్ని పిలువలేదు. మావాడి హోదా వాళ్లకి నచ్చిందిగానీ మా హోదా నచ్చలేదన్నమాట. నా కొడుకు రెండావుల దూడ అనుకున్నాను గానీ పాలు త్రాగి రొమ్ము గుద్దే రకంలా ఇంత త్వరగా మారతాడనుకోలేదు. మీ వియ్యంకుడిని నాటురకం, మోటురకం అని ఈసడించుకున్నాను. స్టేటస్ అనుకుంటూ పక్కదారి పట్టాను. నిజంగా ఈ విషయంలో నువ్వే అదృష్టవంతుడివోయ్" అన్నాడు.

అదృష్టవశాత్తు నాకా దిగులు లేదు. ఉమ్మడి కుటుంబంలో కష్టం, సుఖం తెలిసిన వాతావరణంలో పుట్టి పెరిగిన మహాలక్ష్మిపై అంత నమ్మకం ఏర్ప డింది నాకు.

మంచితనానికి మారుపేరైన ఈ కొమ్మ మా ఇంటి పట్టుకొమ్మని, ఈ జీవితానికి ఇంకేం కావాలని...తృప్తిగా నిట్టూర్చాను.

★

## రికార్డుకెక్కిన కళాఖండం



ఇంతవరకూ 2004లో న్యూయార్క్‌లో జరిగిన వేలం పాటలో ప్రపంచ ప్రఖ్యాత చిత్ర కారుడు పికాసో Garconala Pipe చిత్రానికి 104.2 మిలియన్ డాలర్లు వచ్చిందే ప్రపంచ రికార్డు. ఇటీవల లండన్‌లో స్విస్ శిల్పకారుడు ఆల్బర్టో గ్లాకోమెట్టీ రూపకల్పన చేసిన 'L' homme qui marche I శిల్పం ఆ రికార్డును అధిగమించింది. వేలంపాటదారులు మొదట 29 మిలియన్ డాలర్ల దాకా రావచ్చునని అంచనా వేసారుట. కానీ ఒక అజ్ఞాత కళాభిమాని దాన్ని 104.3 మిలియన్ డాలర్లు (రు.520 కోట్లు)కి పాడి అందరి ఊహల్ని తారుమారు చేసాడు.

-తటవర్తి

